# జ్ఞానదాత

పది గంటల వేళ, ఆ పాఠశాల వాతవరణమంతా సందడిగా వుంది. ప్రార్ధన పూర్తయి ఎవరి క్లాసుల్లోకి వాళ్ళు హడావుడిగా పరుగులు తీస్తున్నారు. తమ మొదట చెప్పవలసినది ఆ రోజు ఎనిమిదవ తరగతి కావడంతో మురళి క్లాసు రూంలో అడుగు పెట్టాడు. ఆ క్లాసంటే అతనికి తెగ చిరాకు. రంగి, మంగన్న, గైరమ్మ గోపిగాడు అంతా ఎనిమిదవ తరగతే చదువుతున్నారు.

ఆ కూలి వెధపల మోహాలు చూస్తూ పాఠాలు చెప్పటమా? ఎప్పుడూ విసుగ్గానే అనిపిస్తుంది.

మాస్టార్ని చూడగానే క్లాసు క్లాసంతా ఒకేసారి లేచి నమస్కరించింది. కూర్చోమని కళ్ళతోనే ఆజ్ఞాపించి తను కుర్చీలో ఆశీనుడై ఎటెండెన్స్ రిజిష్టర్ చేతుల్లోకి తీసుకున్నాడు. తనకి విసుగుతెప్పించే నలుగురు ఎప్పుడూ హాజరే.

డాక్టర్‌గారి గారాలపట్టి మంజూ, ఇంజనీర్‌గారి ఏకైక పుత్రిక ఇందు, వర్తక శిఖామణి వాసుదేవరావు కొడుకు వేణు ఈ రోజు గైరుహాజరు. ఇందు, మంజు, వేణు లేనిదే తనకు తేస్టేముంది? క్లాస్‌కి కాస్త వన్నె తెచ్చేది వాళ్ళే! ఇందు, మంజు ఎంతో నాజూకుగా కనిపిస్తారు. యూనిఫారమ్‌లోనే అయినా ఎంతో అందంగా మెరిసిపోతారు. వేణు అయితే చాకులాంటి కుర్రాడు. రాచబిడ్డలా ఎంత ఠీవిగా వుంటాడని! తను పాఠం చెపుతున్నంతసేపూ వాళ్ళ చురుకైన కళ్ళే తనకి ఉత్సాహాన్నిచ్చేవి. ఇవాళ ముగ్గురూ కూడబలుక్కున్నట్టు బడి ఎగ్గొట్టేశారు.

అన్యమనస్కంగానే పాఠం ప్రారంభించాడు. పాఠం వింటూన్న గైరమ్మ చూపులు పుస్తకంలోనే వున్నా, కళ్ళ రెప్పలు వాలిపోతున్నాయి. ప్రక్కనే వున్న రంగమ్మ మోచేత్తో గైరమ్మను పొడిచి, "ఒంట్లో బాగులేదా?'' అని అడిగింది. గైరమ్మ సమాధానం చెప్పేలోగా "సైలెన్స్ సైలెన్స్" క్లాసులో ఏమిటా కబుర్లు? లేచి నించోండి మీరిద్దరు?" అన్న మాస్టారి మాటకు- రంగి గైరమ్మ మాటడకుండా లేచి నించున్నారు.

"పాఠంమీద దృష్టి లేకుండా ఏమిటా కబుర్లు! చదువుకోవాలని

లేకపోతే పనోపాటో చేసుకోరాదూ? ఏగూటి పిట్ట ఆ గూటి పలుకు తుందని''- మాష్టారింకా ఏదో అంటూండగానే-

గైరమ్మ తల్లి, క్లాసు గుమ్మం ముందువచ్చి నించుంది. చేతులు జోడించి "దండాలు మాట్టరుబాబూ" అంది వినయంగా.

"ఎవరు నువ్వు?" కటువుగా పలికింది మురళి కంఠం.

"నాను బాబూ! గైరి తల్లిని" ద్వారం పట్టుకొని మురళివైపు చూపులు సారించి అంది.

"ఆ ఏమంటావ్? ఎందుకొచ్చావ్"? కళ్లురజేశాడు.

"ఏటి సెప్పమంటారు? ఇదీ నా బొట్టి. ఇంటికాడ నాకు సెప్ప కుండా బడికి పారొచ్చీసింది.

"అందుకు నేనేం చెయ్యను? అయినా క్లాసు జరుగుతున్నప్పుడు ఇలా మాట్లాడకూడదు. వెళ్ళి ఆ చెట్టుదగ్గర నిలబడు. ఇంటర్‌వెల్ టైంలో చెప్పొచ్చులే నీ సొద. ఇలాంటి అలగా జనం అంతా చదు వుల కోసం ఎగబడితే ఇహ! పాఠాలు జరిగినట్టే." వీళ్ళ గొడవల తోనే సరిపోతుంది". విసుక్కున్నారు మాష్టారు.

తిరిగి పాఠం చెప్పటం మొదలుపెట్టాడేగాని దృష్టి అంతా శ్రద్ధగా వింటున్న గైరమ్మమీదే వుంది. అరె! తల్లి వచ్చి ఏమం టుందో అన్న భయం కూడా లేకుండా ఈ పిల్ల పాఠంమీదనే ఎలా మనసు లగ్నం చేయగలిగింది? మురళిని ఆశ్చర్యపరుస్తూ నిశ్చ లంగా నిలబడి క్లాసు జరుగుతున్నంత సేపూ అలా శ్రద్ధగానే పాఠం వినసాగింది.

"ఇంతకీ ఏమిటమ్మా నీ సోది! నీ కూతురు చెప్పకుండా స్కూలుకి వచ్చేస్తే దాన్ని తిట్టు, కొట్టు, మధ్య నన్నేమంటావ్''?

"నేదు మాట్టారు బాబూ, తవరే దానికి గట్టిగా బుద్ధి సెప్పాలి. రోజూ నిద్ర నేసింది మొదలు బడిలోకి పోతానని ఒకటే ఉరుకులు, పరుగులు. పనీపాటూ సేసుకోయే అంటే ఇన్పించుకోదూ, సదువు కుంతదట సదువు?" మళ్ళీ సాగించింది తన గోడు.

"ఓరి లెక్కల కట్టం వోళ్లు నేసుకొని ఏ పూటకాపూట పొట్ట నింపుకోవలసి నోల్లంమేం. మా బోటోల్లకెందుకు బాబూ ఈ సదువులు! నేనెంత పోరినా ఇనకుంతుంది. దీని అయ్య ఓడు, ఈ గుంటకి వంతపాడుతాడు. పదవతరగతి అయినా సదువుతే దాని బతుకు అదే బతుకుద్దట. ఊకదంపు కబుర్లు సెప్తాడు. అచ్చరం ముక్కలు అన్నవెడతాయా మా బోటోల్లకి?" తన మనసులో మాటలే ఆమె నోట వస్తున్నాయ్.

ఈవిడ దోరణి చూస్తుంటే కూతుర్ని ఎలాగైనా చదువు మాన్పించేట్టు వుంది.

అమ్మయ్య! అలా జరిగితే ఒక దరిద్రదేవత ముఖం చూడటం అయినా తప్పుతుంది. తనకి అనుకున్నాడు.

"నువ్వన్నమాట నూటికి నూరు పాళ్ళు నిజం. తక్షణం నీ కూతుర్ని నీతో తీసికెళ్ళి ఏదైనా పనిలో పెట్టు. ఎవరి మాటలు పట్టించుకోకు".

మరుక్షణమే గైరి రెక్క పుచ్చుకొని బరబరా ఇవతలికి లాక్కొచ్చింది. దీనంగా మాస్టారివైపు చూస్తున్నాయ్ గైరమ్మ కళ్లు.

"ఎందుకలా చూస్తావ్? వెళ్ళవే! మీ అమ్మ వెంట. నీ ముఖానికి చదువేమిటి? మీ అమ్మ చెప్పినట్టు వినుకో. పనీపాటూ చేసుకో.

సరస్వతీ కటాక్షం అందరికీ అబ్బుతుందా''? చీదరింపుగా గ్గైరి ముఖంలోకి చూస్తూ అన్నాడు.

"అట్టా సెప్పండి, మల్లీ సదువు, గిదువు, బడి, గిడి అని నస పెట్టకుండా, ఏటి బాబూ ఓ అమ్మ గోరొచ్చి దీన్ని పనికంపమని మా సెడ్డ ఇదిగా అడుగుతున్నారు. ఎల్తే దీనికేటైపోతాది? మాదొడ్డ మనసుతో నెల కొందరూపాయిలిత్తానన్నారు, తిండి, బట్ట దీని బాగోగులన్నీ చూసు కుంతానన్నారు. ఇంతకన్నా ఏటి కావాలేటి? ఏ సదువులు మాకి బాగుసేత్తాయ్? సేతికి దొరికిన పని ఒగ్గితే మల్లీ దొరుకుద్దా అంట!" ఆనేసి కూతుర్ని వెంటపట్టుకు వెళ్ళిపోయింది.

అతని మనసు కాస్తంత తేలిక పడింది. గ్గైరి, రంగి ఒకటై ఎప్పుడూ ఏవో గుసగుసలు. ఇహ ఒకర్తి తగ్గింది. నేస్తగత్తె లేక పోతే రంగి కూడా బహుశా రాదేమో! ఆశగా అనుకున్నాడు.

రెండు ఉయ్యాలలూ ఊపుతోంది గ్గైరమ్మ. పాప, బాబు నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నాక పాల సీసాలు శుభ్రం చేసి, పక్కబట్టలు తడిపి ఆరేసింది.

"అమ్మగారు! గిన్నెలు పడెయ్యరు!" దీక్షగా పుస్తకం చదువు తున్న అరుణ ఉలిక్కిపడింది.

"నీ చేతిలో ఏ మహత్యం వుందే తల్లీ! పిల్ల లిద్దరినీ అప్పుడే నిద్రపుచ్చేశావా''

"అంతేకాదండి పాల సీసాలు శుభ్రం చేసేసి, వాళ్ల పక్క బట్టలు కూడా తడిపి ఆరేశాను. గిన్నెలు తోమేసి, గమ్మున ఇల్లు ఊడ్చేశానంటే వేరే పనే వుండదు.

అరుణ విస్మయంగా చూసింది. తనవాళ్ళని వదలివచ్చిన బెంగ కనబడనివ్వకుండా గైరమ్మ ఎంత హుషారుగా ప్రతి పనీ తనదే అన్నట్టు చేసుకుపోతోంది.

"ఏంటమ్మా అలా చూస్తారు? అంట్ల గిన్నెలు పడెయ్యండి"

"అబ్బ అంత తొందరేం లేదులేవే. ఒక్క నిమిషం ఊపిరి తీసుకో. టీ పెడతాను. ఇద్దరం తాగాక తీరికగా చేద్దువుగాని ఆ పని. నీ పని తెమిలేలోగా వాళ్ళులేచి ఏడిస్తే నేనున్నాను కదే! ఆత్మీయంగా అంది అరుణ.

గైరమ్మ ముఖంలో చిరునవ్వు తొంగిచూసింది. అరుణ మనస్సు కెందుకో హాయిగా అన్పించింది. ఇది వచ్చిన రెండు వారాలుగా ముఖంలో ఏ భావం ప్రస్ఫుటం కానివ్వలేదు. అన్నిటికి అతీతంగా వున్నట్టు బాధ, ఆనందం ఏదీ కనబడనివ్వదు. పని చేసుకోవడం మాత్రమే తన ధ్యేయమన్నట్టు వుండే దీని ముఖంలో ఇవాళే కని పించింది. ఈ మాత్రం ఆనందం గైరమ్మ గురించే ఆలోచిస్తూ టీ తయారుచేసింది. దానికి ఓ కప్పిచ్చి తనూ తాగుతూ "గైరీ! నీ కిక్కడ బాగుందా?" మృదువుగా అడిగింది. అంత మెత్తగా లాలనగా తనతో ఇంతవరకూ ఎవ్వరూ మాట్లాడలేదు. సంతోషంతో మాట రాలేదు. బావుందన్నట్టు తలవూపింది. అరుణ చేతుల్లో ఖాళీ కప్పు తీసుకుని పెరట్లోకి వెళ్ళిపోయింది.

ఆ ఇద్దరి మధ్య రోజురోజుకీ సాన్నిహిత్యం పెరుగుతూ వచ్చింది. వివాహ జీవితంలో అడుగిడిన ఏడాదికే జంటగా పాప, బాబు పుట్టుకొచ్చేసరికి ఇరవై రెండేళ్ళ అరుణ మనస్సులో మాతృత్వపు మమకారం అట్టడుగు పొరల్లోకి పోయి ఈ పిల్లల్ని ఎలా పెంచగలను? అన్న భయం చోటుచేసుకుంది. తనవాళ్ళు, శ్రీవారి

వైపు బంధువులు, అందరికి ఎవరి జంఝాటాలు వాళ్ళకి వుండనే వున్నాయ్. తమతో ఇంతదూరం వచ్చి పిల్లలు కాస్త పెరిగేవరకైన చెయ్యాసరా అందించడం కుదిరేపని కాదు. అమ్మ గైరి తల్లితో మాట్లాడి దాన్ని తనతో పంపింది. తనబెంగ పటాపంచలైంది. గైరి కేవలం పనిపిల్లలా అనిపించదు. ఓ తోబుట్టువులా, మనసు తెలిసిన స్నేహితురాలిలా, ఇంకాఇంకా ఎలానో అనిపిస్తుంది. దానితో తనకి ఏదో తెలియని బంధం వున్నట్టు అనుభూతి చెందుతుంది అరుణ. పిల్లలు ఎంత అల్లరిచేసినా శ్రీవారి మిత్రబృందం ఆదివారాలలోను సెలవురోజుల్లోనూ పేకాట పేరుతోను, పార్టీల రూపేణా ఎంత అలజడి సృష్టించినా పని ఎక్కువైనందుకు ఏ మాత్రం విసుగు చూపించదు ఒక్క సంవత్సరం తిరిగేసరికి ఆ కవలలు పేచీలు, అల్లర్లు మరింత తారాస్థాయినందుకున్నాయి. ఇద్దరికీ ఒకేసారి పాలుపట్టాలి. ఇద్దరినీ ఒకేసారి ఎత్తుకోవాలి. నిద్రలో వున్నప్పుడు తప్ప వాళ్ళ చిలిపి చేష్టలతో మిగిలిన సమయమంతా తెగవేపుకు తినేస్తారు. ఒక్కోసారి అర్ధరాత్రి ఆటలు మొదలుపెట్టి నిద్రకు నోచుకోనివ్వరు. అలాంటప్పుడు కూడా గైరి ఎంతో ఓపికతో ఆడిస్తూ అరుణని నిద్రపొమ్మనేది. ఇది మామూలు పనిమనిషి కాదు. తనకోసం పుట్టిన చిన్నారి తోడు అనుకునేది. అలాటప్పుడే ఆమెకు గైరిపట్ల ఏదో అవ్యక్తానురాగం అలుముకుంటుంది. దాని ప్రతీ చర్యను ఎంతో అపేక్షగా గమనిస్తూ గైరి కోసం తనేం చెయ్యాలనే ఆలోచనలో పడేది. ఆ రోజు అలానే ఆలోచిస్తూ సెలవులు నాలుగు రోజులూ శ్రీవారు ఇంటి పట్టునే వుంటారు కనుక గైరి తన ఊరు వెళుతుం[illegible]పంపుదామనుకుంది. ఆ మాట విన్న గైరి కళ్ళల్లో మెరుపులు చూసి మైమరిచిపోవాలనుకుంది. ఆ ఊహ రావటమే తడవు గైరీ, గైరీ", అంటూ ఐదారుసార్లు పిలిచింది. అది పలక్కపోవడంతో వీధి

వరండాలోకి వెళ్ళింది. పిల్లల అలికిడికూడా లేదే! ఇద్దర్నీ తీసుకొని ఎటు వెళ్ళిందబ్బా అనుకుంటూ తలుపు చారేసి నాలుగడుగులు వేసిందో లేదో ఇంటి ఎదురుగా వున్న బడి ముందు బాబుని పాపని చెరో చంకని ఎత్తుకొని కనిపించింది. పిల్లలంతా బిలబిలమంటూ బయటకొచ్చేస్తున్నారు చేతుల్లో పుస్తకాల సంచులు, ఖాళీ టిఫిన్ బాక్సులతో, కొత్త పాఠాలు నేర్చుకున్న ఉత్సాహం, అంతమంది సహాధ్యాయులతో, గురువుల సమక్షంలో గడిపిన ఆనందం ప్రతీ చిన్నారి ముఖంలోనూ ప్రస్ఫుటం అవుతున్నాయి. తదేకంగా ఆ బడిపిల్లలవైపే చూస్తుండిపోయింది. బాబు గైరి జుత్తు పీకుతున్నాడు కొంటెగా, 'నన్ను దించేయ్' అంటూ తన మాట వినిపించు కోనందుకు గైరి బుగ్గలు గిల్లుతూ ఏడుపు లంకించుకుంది పాప. సముదాయించే ప్రయత్నము చెయ్యలేదు గైరి. పరధ్యాన్నముగా అలానే నిలబడింది. అరుణ గభాల్న పాపనందుకుంది. అప్పుడు అదిరిపడి చూసింది గైరి. తప్పు చేసినట్టు తలదించుకుంది అమాయకంగా, జారిపోతున్న బాబుని సరిగ్గా ఎత్తుకుంటూ "అమ్మ గారూ! బుజ్జిగాణ్ణి, చిట్టితల్లిని ఈ బడిపిల్లల్ని చూపించి ఆడిద్దామని ఇటొచ్చాను". తన కన్నీరు అరుణ కంటపడకుండా చేతితో తుడి చేసుకుంటూ అంది. అప్పుడే బయటకు వచ్చిన టీచర్ గైరి చేతుల్లో బాబుని ముద్దాడుతూ ''రోజూ మీ వాళ్లతో నాకు బాగా అలవాటై పోయింది. ఇలా వీళ్ళనొకసారి ముద్దాడితే చాలు స్కూల్లో ఆ పెంకి ఘటాలతో పడ్డ శ్రమంతా ఇట్టే ఎగిరిపోతుంది". అరుణ చేతుల్లో పాపను కూడా ముద్దాడుతూ ఆమె ముఖంలోకి చూచి, నవ్వుతూ అంది. విస్తుపోవటం తనవంతయింది. "అవునండి, రోజూ మీ గైరి బడి వదిలేవేళ వీళ్ళిద్దర్ని ఇలా షికారు తీసుకొస్తుంది" అరుణ విస్మయం నుంచి తేరుకొని స్నేహపూర్వకంగా తనూ నవ్వింది.

లోపలికి వస్తూనే ఆపేక్షగాను, అప్యాయంగానూ గైరి ముఖంలోకి చూసింది. అది పనిలోకి వచ్చిన తొలి రోజుల్లో ఏమీ పట్టనట్టు వుండడము, తన ఇంటికి వచ్చేసినందుకు దేన్నో పోగొట్టుకున్నట్టు దిగులుపడటం స్ఫురణకు వచ్చాయి. గైరిని తనవెంట పంపేముందు అమ్మ అన్న మాటలు గుర్తు వచ్చాయి. "దేవుడమ్మ కూతురు కనుక నీతో వచ్చేస్తే సుఖపడతావు. కాని ఆ పిల్ల తల్లిమాట వినకుండా వుంది. చదువుమానేసి పనిలోకిరాదుట" గైరి గురించిన ఆలోచనలు అన్ని ఒక కొలిక్కి వచ్చేయి. ఇదన్నమాట! ఈ పిల్ల మనసుని పట్టి పీడిస్తున్న ఆవేదన, అరుణ ఓ నిర్ణయానికి వచ్చింది. పాపకి పాలుపడుతున్న గైరి దగ్గరికి వచ్చి లాలనగా అంది. "ఏమే గైరీ నువ్వు చదువుకుంటావేమిటి"? ఆ మాటకి గైరి కళ్ళల్లో వింత మెరుపులు కనిపించాయి. అంతలో ఆ చిన్నారి కళ్ళే వానకారు మేఘాలయ్యాయి. అంధకారాన్ని చీల్చి వెలుగురేఖలు విరజిమ్మే రవి కిరణాల్లా అరుణ కరస్పర్శ "నువ్వు అలమటిస్తున్న ఆ విద్యా జ్ఞానాన్ని నీకు నేను దానము చేస్తాను" అన్నట్టుగా ఆ అశ్రుధారలని మాయం చేసింది.

"ఇవ్వాళ యింత హడావిడి ఏంటి అరుణా!" పనిలో సతమత మవుతూ గైరితో కలసి ఇల్లంతా సర్దుతున్న భార్యతో అన్నాడు.

"హడావిడి కాదేమిటి? ఈ రోజే కదా మా అన్నయ్య వచ్చేది. మనం ఈ వూరు వచ్చేక అసలు వాడు రానేలేదు. ఇప్పుడైనా పిల్ల లని కాన్వెంటులో చేర్చేందుకు నువ్వు వుండితీరాలి అని పట్టుబడితే సరే అన్నాడు."

"ఇదా నీ సంతోషానికి కారణం! పిల్లలని స్కూలుకి పంపేందుకే ఇల్లు అంతా పెళ్ళి సందడి చేసేస్తున్నావు!" ఫక్కున నవ్వి అన్నాడు.

"మీకు నవుతాలుగానే వుంటుంది. పిల్లలని స్కూలులో వేయడం అంటే ఏమిటి? వాళ్ళ భవిష్యత్తుకి తొలి సోపానం వేయడమే కదా! ఇదివరలో అయితే అక్షరాభ్యాసం అంటూ ఓనమాలు దిద్దించిన రోజు పెద్ద పండగ చేసేవారు. ఆ సంబరము వేరు. ఇప్పుడు అది పాత ఫేషన్ అయిపోయినా కనీసం అన్నయ్య చేత్తో వీళ్ళకి కావలసిన పుస్తకాలు, డ్రస్సులు కొని పలక పట్టిస్తే చాలు" అంది. ఆమెకు ఉపాధ్యాయ వృత్తిపట్ల వున్న గౌరవం అలాంటిది. తను ఎప్పుడూ అన్నయ్యని తోడబుట్టినవానిగా భావించదు. ఎన్నెన్నో చిన్నారి మేధలకు పదును పెట్టి ఆ మస్తిష్కాలలో విద్యాదీపాలు వెలిగించే జ్ఞానదాతగా, ఎంతో ఓర్పుతో, నేర్పుతో ఆ పసిమెదళ్ళకు మేత పెట్టి చైతన్యవంతులుగా తీర్చిదిద్ది భావిపౌరులుగా రూపొందించే మహా నేతగా అత్యంత గౌరవ స్థానం పొందేడు.

అన్నపట్ల ఆ మోస్తరు ఆరాధన పెల్లుబుకుతుండగా ఆనందంతో స్వాగతం ఇచ్చింది.

"మామయ్యా" అంటూ ఇద్దరు పిల్లలూ మీదకి ఉరకబోతే వారించింది.

"మామయ్య ఉత్త మామయ్య కదర్రా. మంచి మాష్టారు" అని వాళ్ళచేత పాదాభివందనం చేయించింది.

ప్రయాణ బడలికతో కాస్త అలసటగా సోఫాలో కూర్చున్నాడు.

ట్రేలో కాఫీ, ఫలహారాలు అమర్చి తీసుకొచ్చిన గిరి ఉలిక్కి పడింది ఆ అమ్మాయి మనస్సు అవ్యక్తమైన భక్తితో నిండిపోయింది. ట్రే టేబుల్‌పైన పెట్టేసి వినమ్రంగా నమస్కరించింది. ఉలిక్కిపడి

చూశాడు. లేత నీలిరంగులో ముదురు నీలపువ్వుల చీరా! త్రాచు పాములాంటి నల్లని జడ! కళ్ళల్లో ఏదో వింతకాంతి! కాటుక రేఖ! అది చీకటి వెలుగుల కలయికా! సూర్యుని ప్రతిబింబములా విశాల మైన నుదుట తీర్చిదిద్దిన తిలకం. రెప్పార్పటం మరచిపోయాడు. ఎదలో ఉదయించిన ప్రశ్న! ఎవరీ అమ్మాయి? జవాబు దొరక లేదు.

"నేను మాష్టారూ! గుర్తులేనా? గైరమ్మని!" అతని గుండె ఝల్లు మంది. అప్పుడే డ్రాయింగు రూములోకి వచ్చిన అరుణ, "ఏరా అన్నయ్యా! ఆవడలు ఏమంటున్నాయి? మా గైరి చేతివంటలు భలే రుచిగా వుంటాయిరా! అరె, అదేమిటి? నువ్వు నోట పెట్టనేలేదు?" అంది అన్నగారి పక్కనే తనూ కూర్చుంటూ.

"అమ్మగారూ! ఈయన ఎవరో కాదు. మా మాష్టారు. నేను స్కూలులో చదివిన మూడు ఏళ్లు చదువు చెప్పిన మాష్టారమ్మా!" ఉద్వేగం, ఉత్సాహం పోటీపడ్డాయి గైరి గొంతులో.

"అలాగటే! అనుకోకుండా మీ గురువుగారిని కలిసేవన్న మాట!"

"అవునమ్మా! నాకు అదే సంబరంగా వుంది."

"ఒరే అన్నాయ్ నీ శిష్యురాలు నా దగ్గర విద్యాభ్యాసం చేస్తోంది ఈ సెప్టెంబర్‌కే మెట్రిక్‌కి పంపిస్తున్నా"

మురళికి తనని ఎవరో ఛెళ్లున కొరడాతో కొట్టినట్టనిపించింది. చేతిలోని ఆవడ జారి ప్లేటులోనే పడిపోయింది. మురళి ముఖంలో కత్తి వేటుకి నెత్తురు బొట్టు లేదు. పట్టుదలతో చదువులో ముందడుగు వేస్తున్న మా గైరి తల్లికి నా యథాశక్తి చదువు నేర్పుతూ,

నా ఆశయాన్ని కూడా నెరవేర్చుకోవాలి అనుకుంటున్నా. నాకూ నీ ఆశీస్సులు తప్పక కావాలి" ఏమంటావు?''

ఏమనగలడు? గిరి చదువు ఆపేసి పనిపిల్లగా మారడానికి తనెంత దోహదం చేశాడు. కూలీ నాలీ జనమని తేలిక భావనతో చూశాడు. ఈ పిల్ల చదువు నేర్చుకోవడానికి ఎంత కుతూహలపడేది. ఈ లేతమనస్సులో జిజ్ఞాసను సమయం వచ్చిందికదా అని ఆ రోజు బలవంతంగా అణగద్రొక్కి తల్లికి తక్షణం పనికే పంపించేయమని సలహా ఇచ్చాడు. ఎంతతీవ్రంగా చెప్పేడు. చాకిరికే అంకితమైనా విద్యాధనం కోసం పరితపించే ఈ పనిపిల్ల తన యజమానురాలి ద్వారానే సముపార్జించుకుంటోంది. అరుణలాంటి సహృదయురాలి అండ లభించడం నిజంగా ఆ సరస్వతే కలిపినట్లుంది ఈ ఇద్దరినీ. అరుణ ఆశయం ముందు ఓడిపోయి తన అంతరాత్మ ముందు తను దోషిఅయ్యాడు నిజానికి ఆశయం అనే ప్రతి వచనానికి ప్రతీక అరుణ. అర్థాలు అరుణ. చిన్నప్పుడు ఆటపాటలలోనే ఉపాధ్యాయిని కావాలని కోరుకునేది చుట్టుప్రక్కల పిల్లలంతా కలిసి ఆడేటప్పుడు మాష్టారె చేతిలో బెత్తంతో అదిలిస్తూ, చిన్న చిన్న దెబ్బలు కూడా కొట్టి పెత్తనం చెలాయిస్తూ, తను మాష్టారయ్యేవాడు ఆటలలో.

"అన్నయ్యా! ఒక్కసారైనా నేను టీచరుగా వుంటానురా! మన బొమ్మలాటలలో. టీచరుగా ఉద్యోగంచేయాలని ఎంచక్కా నానమ్మ దగ్గర బోలెడు పద్యాలు, పాటలు నేర్చుకున్న" చెల్లి బతిమాలితే తను ఏమిచేసేవాడు? లక్కపిడతలు అరుణ ముందుకి తోసేసి "ఆడపిల్లవి నువ్వే వంటచెయ్యాలి. ఎప్పుడూ నేనే మాష్టారిని. ఇలా పేచీ పెట్టకు" అనేసి ఠీవిగా బెత్తం పట్టుకునేవాడు. అమాయకపు

పసితనం అదృశ్యమై ఆ ఆశయం అలానే మిగలడంతో టీచర్ ట్రయినింగ్ అవుదామనుకుంది. అప్పుడు నాన్న అభ్యంతరం ఎదుర్కొంది. సంసార జీవితంలో మునిగిపోయిన అరుణ మనసులోని ఈ ఆశయం వాడలేదన్నమాట! ఒక బేలని విద్యావతిగా తీర్చిదిద్దుతోంది. తన కంటే చెల్లెలే ఉన్నత స్థానంలో వున్నట్టు అనిపించింది.

"ఏమాలోచిస్తున్నావురా అన్నయ్యా?" అరుణ మాటకి అదిరిపడ్డాడు, "నిన్నూరికే పొగడడం లేదు. ఉపాధ్యాయుడంటే ఎవరు? అజ్ఞానపు చీకటి పారద్రోలే జ్ఞాన భాస్కరుడు. విద్యా గంధాలు సోకని గుడిసెల్లో పుట్టి, సంస్కారం ఎరగని వడిలో పెరిగినవాళ్లు సహితం మీవల్ల జ్ఞానవంతులవుతారురా" ఆర్ద్ర నయనాలతో అన్నయ్య వంక చూసింది.

"అంతలేసి మాటలకు నేను తగనే చెల్లాయ్. ఇంత నిశితంగా నేను ఎప్పుడూ ఆలోచించలేదు. కేవలం ఉద్యోగ ధర్మం నిర్వహిస్తున్నా. నాకంటె ఉపాధ్యాయ వృత్తి విలుగ్రహించిన నువ్వే నిజమైన ఉపాధ్యాయినివి. నీచేతిలో విద్యావంతురాలైన ఒక్క గైరి చాలు. నువ్వే ఉత్తమ ఉపాధ్యాయినివి. నిన్ను ఆశీర్వదించడానికి నేనెవ్వడిని? ఈ గదిలో ఆ గోడకు అమర్చుకొని నువ్వు ఆరాధిస్తున్నావు చూడు, ఆ ఫోటో అదేనమ్మా. అదేనమ్మా! అందులోని ఆదర్శ గురుమూర్తి మన సర్వేపల్లి రాధాక్రిష్ణన్ నిన్ను ఆశీర్వదించుతారమ్మా!" అన్న మాటకు అటు వైపు దృక్కులు మరల్చిన అరుణకి చిరునవ్వుతో చూస్తున్న సర్వేపల్లి రాధాక్రిష్ణన్ రూపం అలానే తోచింది. ●

'తమసోమా జ్యోతిర్గమయ'